సాక్షి
కాకినాడ

ఆదివారం | 8 | డిసెంబర్ | 2024



అంగరంగ వైభవం

వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవాలను శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అంగరంగ వైభవంగా నిర్వహించారు.


8లో



అక్షరాలా లక్ష గుడ్లు

తాటిపర్తి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో 20 పుట్టల్లో షష్ఠి సందర్భంగా భక్తులు గుడ్లు వేశారు. ఇక్కడ సుమారు లక్ష గుడ్ల వరకూ విక్రయాలు జరగడం విశేషం.

డెల్టా కాలువలకు 9,600 క్యూసెక్కులు



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు శనివారం 9,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,600, మధ్య డెల్టాకు 1,500, పశ్చిమ డెల్టాకు 4,500 క్యూసెక్కుల చొప్పున నీటిని వదిలారు. బ్యారేజ్ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

భూ వివాదాల పరిష్కారానికి సదస్సులు

కాకినాడ సిటీ: భూ వివాదాల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నెల 10వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకూ జిల్లాలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో రైతు సంఘాల ప్రతినిధులతో జిల్లా స్థాయి సమన్వయ సమావేశాన్ని జేసీ నిర్వహించారు. ఈ సదస్సులు సక్రమంగా నిర్వహించేందుకు రైతు సంఘాల నేతలు, ఇతర ప్రతినిధులతో చర్చించామని జేసీ అన్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో వివిధ రైతు సంఘాల నేతలు, ఇతర ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

9న పీజీఆర్ఎస్ రద్దు

కాకినాడ సిటీ: కాకినాడ కలెక్టరేట్‌లో ఈ నెల 9న నిర్వహించనున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)ను అనివార్య కారణాలతో రద్దు చేశారు. ఈ విషయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా శనివారం తెలిపారు. దీనిని అర్జీదారులు గమనించాలని కోరారు.

యోగా పోటీల్లో బంగారు పతకం

ప్రకాశంనగర్ (రాజమహేంద్రవరం): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఇటీవల జరిగిన అంతర్ కళాశాలల యోగా టోర్నమెంట్‌లో తమ కళాశాల బీఎస్సీ ఫైనల్ ఇయర్ విద్యార్థి టి.సూర్య బంగారు పతకం, జి.శంకర్‌స్వామి కాంస్య పతకం సాధించినట్లు స్థానిక ఎస్‌కేవీటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రమణమూర్తి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 23న భువనేశ్వర్‌లో జరగబోయే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో ఈ క్రీడాకారులు పాల్గొంటారని వివరించారు. విజేతలను స్పోర్ట్స్ విభాగ అధిపతి పీఏ కిషోర్ బాబు, జి.శరత్‌బాబు, సంజీవరావు, డి.శ్రీనివాస్, నరసింహ అభినందించారు.

వచ్చే నెల 8 నుంచి ప్రపంచ తెలుగు మహాసభలు

రాజానగరం: గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో చైతన్య విద్యా సంస్థల ఆధ్వర్యంలో జనవరి 8, 9, 10 తేదీల్లో ప్రపంచ తెలుగు మహాసభలు జరగనున్నాయి. తెలుగు భాషా విశిష్టతను తెలియజేస్తూ, భాషాభిమానాన్ని పెంపొందించే విధంగా సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు ప్రముఖుల ప్రసంగాలు, తెలుగు భాషా వికాసం చర్చలు, సంప్రదాయ కళారూపాల ప్రదర్శనలు ఉంటాయని జీజీయూ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) తెలిపారు.

పరమాత్మ నామ సంకీర్తనతో మోక్షం

అహోబిల రామానుజ జీయర్ స్వామి



రాజమహేంద్రవరం రూరల్: పరమాత్మ నామ సంకీర్తన చేస్తే మోక్షం లభిస్తుందని శ్రీశ్రీశ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి ఉద్బోధించారు. కొంతమంది భక్తితో, మరి కొంతమంది హేళనతో, ఇంకొందరు ఊతంతో, మరికొందరు పరిహాసంతో ఏదో ఒక విధంగా భగవన్నామ స్మరణ చేస్తే, పాపాలన్నీ పోయి ముక్తి లభిస్తుందన్నారు. రాజవోలు గాయత్రీ నగర్‌లో రామాలయం వద్ద శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామి మంగళశాసనాలతో రోజూ సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకూ లోక కల్యాణార్థం అహోబిల రామానుజ జీయర్ స్వామి చేస్తున్న శ్రీమద్భాగవత సప్తాహంలో భాగంగా నాల్గో రోజు శనివారం ప్రవచనం కొనసాగించారు. నిత్యం నారాయణ స్మరణతో నరనరాన నారాయణ శబ్దం జీర్ణించుకుంటే సద్బుద్ధి అలవడుతుందని అహోబిల రామానుజ జీయర్ స్వామి అన్నారు. నారాయణ అంటే చాలు పాపాలన్నీ పోతాయని, అయితే నిత్యం ఇలా స్మరించడం వల్ల పాపాలకు దూరంగా ఉంటామని ఆయన అన్నారు. అజామిళుని వృత్తాంతం ఇదే చెబుతుందన్నారు. అజామిళునకు శరీర పటుత్వం తగ్గి రోగగ్రస్తుడై చావునకు సిద్ధంగా ఉన్న సమయంలో యమభటులు ప్రత్యక్షమవడంతో భయంతో తన కుమారుడిని నారాయణ అని పిలుస్తాడని, అలా అజామిళుని నోట నారాయణ అనే శబ్దం వినబడగానే యమభటులు గడగడ వణుకుతూ వెళ్లిపోయారని వివరించారు. ఆ విధంగా విష్ణు దూతలు వచ్చి కాపాడడంతో అజామిళుడు పశ్చాత్తాపం చెంది ఏకాగ్రత చిత్తంతో తన మనస్సును ఆ శ్రీహరిపై నిలిపి గంగా తీరాన స్నానం చేసి, అయ్యో ఇన్నాళ్లూ ఎంత సమయం వృథా చేసుకున్నానని బాధపడి భగవన్నామ స్మరణ చేస్తూ, మోక్షం పొంది వైకుంఠానికి వెళ్లాడని అహోబిల రామానుజ జీయర్ స్వామి వివరించారు. అజామిళుని మాదిరిగా అందరికీ అంత్య సమయంలో భగవన్నామ స్మరణ గుర్తుకు రాదన్నారు. అందుకే మొదటి నుంచి భగవన్నామ స్మరణ అలవరచుకోవాలన్నారు.

కరుణ చూపక



- రైతులకు అందని వ్యవసాయ రుణాలు
- మొండిచేయి చూపిన సహకార బ్యాంక్‌లు
- కూటమి ప్రభుత్వ తీరుతో అవస్థలు
- రుణ సాయం లక్ష్యం రూ.260 కోట్లు.. ఇచ్చింది రూ.141 కోట్లు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): సాగుకు గ్రహణం పట్టింది.. కూటమి ప్రభుత్వంలో వ్యవసాయ రంగం ఒడిదొడుకులను ఎదుర్కొంటోంది.. రైతు సంక్షేమం కంటిచూపునకు దూరమైంది.. గత ప్రభుత్వంలో అన్నదాతల బాగుకు రైతు భరోసా కేంద్రాల ద్వారా తోడ్పాటు అందేది. సాగు పండగైంది. బ్యాంకర్లకు ప్రభుత్వమే హామీ ఉంటామంటూ భరోసా కల్పించి రైతులకు పెద్ద ఎత్తున రుణం సాయం కల్పించింది. ప్రస్తుత ప్రభుత్వంలో అందుకు భిన్నంగా ఉంది. ఐదు నెలల కిందట అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ రైతులను పూర్తిగా విస్మరించింది. సాగుకు రుణ సాయం అందించడంలో సాధారణ లక్ష్యాన్ని కూడా చేరుకోలేక పోయింది. కాకినాడ జిల్లాలోని సహకార బ్యాంకు పరిధిలో సుమారు రెండు లక్షల మందికి పైగా రైతులు ఉన్నారు. ఇందులో ఈ ఖరీఫ్‌లో 30 వేల మందికి మాత్రమే వ్యవసాయ రుణాలు ఇచ్చింది. మిగిలిన రైతులకు మొండిచేయి చూపింది. కొన్ని సహకార సంఘాల పరిధిలో అసలు రుణాలు ఇచ్చేందుకు ముందుకు రాక పుడమి పుత్రులు ప్రైవేట్ బ్యాంకర్లు, వడ్డీ వ్యాపారుల వద్ద రుణాలు తీసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. ఆ అప్పులు కట్టలేక రైతన్నలు దిగాలు చెందుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా రూ.13,500 అందించడంతో పంట పెట్టుబడి సాయంగా ఉపయోగపడేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే ఏడాది రైతుకు రూ.20 వేలు ఇస్తామని చెప్పినా ఆ మాటను పక్కనపెట్టేసింది. ఇప్పటి వరకూ రైతు ఖాతాల్లో నయా పైసా కూడా వేయలేకపోయింది.

ఖరీఫ్.. సాయం ఉఫ్

కాకినాడ జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులకు రూ.260 కోట్ల రుణాలు అందించాలని లక్ష్యం పెట్టుకోగా, ఇందులో రూ.141 కోట్లు మాత్రమే ఇచ్చింది. సుమారు సగం మంది రైతులకు మాత్రమే రుణ సాయం అందించింది. మిగిలిన రైతులకు రుణాలు అందక బయట అధిక వడ్డీలకు రుణాలు తెచ్చుకుని ఇబ్బంది పడే పరిస్థితి తెచ్చింది. సహకార సంఘాలకు వెళ్లినా రైతులకు రుణాలు ఇచ్చేందుకు పలు కొర్రీలు పెట్టడంతో విసుగుచెంది బయట వ్యాపారుల వద్ద అప్పులు తెచ్చుకొని మరీ ఈ సీజన్‌లో పెట్టుబడులు పెట్టారు. గత ప్రభుత్వంతో పోల్చుకుంటే ఈ సీజన్‌లో రైతులకు రుణాలు ఇచ్చేందుకు సహకార సంఘాలు ముందుకు రాలేదు. దీనికితోడు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటల దిగుబడి బాగా తగ్గింది. పెట్టుబడులు కూడా రాక అధిక వడ్డీలు కట్టలేక రైతులు అప్పుల బారిన పడాల్సి పరిస్థితి నెలకొంటుంది. ప్రభుత్వం నుంచి సహకారం లేక ఇబ్బందులు పడుతున్నామని కర్షకులు ఆవేదన చెందుతున్నారు.

డబ్బులు లేవంటూ..

కొన్ని సహకార సంఘాల పరిధిలోని రైతులకు అసలు రుణాలు ఇచ్చేందుకు ఆయా సహకార అధికారులు సుముఖత చూపలేదు. ఆయా సహకార సంఘాల పరిధిలో గతంలో రుణాలు తీసుకుని చెల్లించని కారణంగా ఆయా సహకార సంఘాలకు డీసీసీబీ రుణ పరిమితి తగ్గించడంతో రైతులకు ఈ ఖరీఫ్‌లో రుణాలు అందని పరిస్థితి ఉంది. పెద్దాపురం మండలం కాండ్రకోట, కిర్లంపూడి సహకార సంఘం, రంపకలోవ, జగ్గంపేట మండలాల్లో రైతులకు రుణాలు ఇచ్చేందుకు ఆయా సహకార సంఘాలకు చెందిన అధికారులు ముందుకు రాలేదు. దీంతో ఆయా సహకార సంఘాల పరిధిలో సుమారు 10 వేల మందికి పైగా రైతులు సక్రమంగా రుణాలు అందక అవస్థలు పడ్డారు.

కౌలు రైతులకూ కష్టాలు

జిల్లాలో సుమారు 40 వేలకు పైగా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చారు. కానీ అవి అలంకార ప్రాయంగానే మిగిలాయి. ఒక్క రైతుకు కూడా ఈ సీజన్‌లో రుణం సాయం అందించలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చి మరీ ప్రతి సీజన్‌లో సుమారు 60 వేల మంది రైతులకు ఒక్కొక్కరికి రూ. 50 వేలకు తక్కువ కాకుండా రుణాలు ఇచ్చారు. ప్రస్తుతం కౌలు రైతులకు ఒక్క పైసా కూడా రుణం ఇచ్చిన దాఖలాలు లేవు. ప్రైవేట్ బ్యాంకులైతే సవాలక్ష డాక్యుమెంట్లు కావాలని అడ్డంకులు పెట్టాయి. గత ప్రభుత్వం డీసీసీబీ బ్యాంకుల ద్వారా కేవలం కౌలు గుర్తింపు కార్డుఉన్న రైతులకు విరివిగా రుణాలు అందించింది. ప్రస్తుతం రుణాల మంజూరుకు డీసీసీబీ బ్యాంకులు సైతం వెనకడుగు వేయడంతో కౌలు రైతులు అప్పుల పాలయ్యారు. రైతుకు శిస్తు చెల్లించి పెట్టుబడుల కోసం ప్రైవేట్ వ్యాపారుల దగ్గర అధిక వడ్డీలకు రుణాలు తెచ్చి సాగు చేశారు. కనీసం రబీ సీజన్‌లోనైనా సహకార బ్యాంక్‌ల నుంచి రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కౌలు రైతులు కోరుతున్నారు.

సరైన సమాధానం రాలేదు



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు బాగా రుణాలు ఇచ్చేవారు. ప్రస్తుతం రుణాలు అడిగినా సహకార సంఘాల అధికారులు సరైన సమాధానం చెప్పడం లేదు. పాత రుణాలు రెన్యువల్ చేయడం తప్ప కొత్త రుణాలు ఇవ్వలేదు. దీంతో పంట పెట్టుబడుల కోసం ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించాల్సిన పరిస్థితి వచ్చింది.

– బండే వీరబాబు, రైతు, వేములవాడ, కరప మండలం

తిరిగి తిరిగి అలసిపోయాం



కూటమి ప్రభుత్వంలో రైతులను పట్టించుకోవడం లేదు. రుణాల కోసం సహకార బ్యాంకులకు తిరిగి తిరిగి అలసిపోయాం. చివరికి బయట వ్యాపారుల వద్ద రుణాలు తెచ్చుకుని ఈ ఖరీఫ్‌ను నెట్టుకొచ్చాం. అధిక వడ్డీల కారణంగా ఈ సీజన్‌లో పెద్దగా ఏమీ మిగలలేదు. కనీసం రబీ సీజన్‌లో రైతులకు రుణాలు అందించి ఆదుకోవాలి.

–అదబాల గోవిందు, రైతు వీకే రాయపురం, సామర్లకోట మండలం

వైద్యుడంటే నిరంతర విద్యార్థి



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ నరసింహం

కాకినాడ క్రైం: వైద్యుడంటే నిరంతర విద్యార్థి అని డాక్టర్ ఎన్టీఆర్ యూహెచ్ఎస్ వైస్ చాన్సలర్, ఏపీ డీఎంఈ, ఆర్ఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం అన్నారు. మూడు రోజుల పాటు కాకినాడ కుళాయి చెరువు ఆవరణలోని ఫ్యాబిన్ కన్వెన్షన్‌లో జరిగిన ప్లాస్టిక్ సర్జరీ 12వ రాష్ట్ర స్థాయి సదస్సు శనివారంతో ముగిసింది. ఏపీఆర్ఏఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు చైర్మన్ డాక్టర్ కృష్ణారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ, ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ రత్నభూషణ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ నరసింహం మాట్లాడుతూ, వైద్యుడు నిరంతరం నేర్చుకుంటేనే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. వైద్య రంగంలో చోటు చేసుకుంటున్న మార్పులను ఆహ్వానించి ఆకళింపు చేసుకోవడం ద్వారా రోగికి అత్యుత్తమ వైద్యం అందించగలిగే నైపుణ్యవంతులైన వైద్యులు పుట్టుకొస్తారన్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరసింహ నాయక్ మాట్లాడారు. అనంతరం వివిధ అంశాలపై పేపర్ ప్రజెంటేషన్లు, క్విజ్ పోటీలు నిర్వహించారు. బెస్ట్ పబ్లికేషన్ కేటగిరీలను ఎంపిక చేశారు.

తరలి వెళ్లిన స్కిల్ ల్యాబ్

కదిలే విజ్ఞాన రథం తరలి వెళ్లింది. రెండు రోజుల పాటు కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో పీజీ విద్యార్థులకు విజ్ఞాన సేవలందించిన స్కిల్ ల్యాబ్ బస్ సేవలు ముగిశాయి. జాన్సన్ అండ్ జాన్సన్ సంస్థకు చెందిన స్కిల్ ల్యాబ్ బస్ ద్వారా వివిధ అంశాలకు చెందిన శస్త్రచికిత్స ప్రక్రియలను విద్యార్థులు నేర్చుకున్నారు. 100 మంది వైద్య విద్యార్థులు ప్రయోజనం పొందారు. విజ్ఞాన వృద్ధికి ఓ అరుదైన అవకాశమని వారంతా అభిప్రాయపడ్డారు. జాన్సన్ అండ్ జాన్సన్ కోస్తా ఆంధ్ర ప్రతినిధి ప్రమీల వేమగిరి ఆధ్వర్యంలో సర్జరీ సహా పలు స్పెషాలిటీలకు చెందిన వైద్య బృందాల పర్యవేక్షణలో శిక్షణ తరగతులు నిర్వహించారు.

లెక్క తప్పింది!



ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక వద్ద స్కవర్ స్లూయిజ్ గేట్లు ధ్వంసమై లీకవుతున్న నీరు

- కాటన్ బ్యారేజీ నిర్వహణపై నిర్లక్ష్యం
- గేట్లు దాటి ఓవర్ ఫ్లో అవుతున్న నీరు
- పలుచోట్ల లీకేజీలు
- ఆ నీటిని లెక్కించని అధికారులు
- రబీకి నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం

సాక్షి, అమలాపురం: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలతో పాటు పలు ప్రాంతాల నీటి అవసరాలను తీర్చే ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీపై నిర్లక్ష్యపు నీడలు కమ్ముకున్నాయి. హార్ట్ ఆఫ్ గోదావరి డెల్టాగా పిలిచే బ్యారేజీ నిర్వహణను జల వనరుల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. బ్యారేజీ మరమ్మతులు, నీటి నిల్వ సమయంలో నిబంధనలు పాటించడం లేదు. దీని వల్ల బ్యారేజీ గేట్లు దెబ్బతినడంతో పాటు రబీ సాగు సమయంలో నీటిని నిల్వ చేయడం, ఆయకట్టుకు సరఫరా చేయడం వంటి విషయాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.

రబీ వరిసాగు 8.96 లక్షల ఎకరాలు

అధికారుల లెక్కల ప్రకారం గోదావరి డెల్టాలో రబీ వరిసాగు 8.96 లక్షల ఎకరాలు. ఇందుకు సుమారు 90 టీఎంసీల వరకు నీరు అవసరం. ఈ ఏడాది నీటి ఇబ్బంది ఉండదని అధికారులు చెబుతున్నారు. కానీ బ్యారేజీ వద్ద పలు గేట్ల ద్వారా నీరు లీకవుతుండడం, అధ్వానంగా ఉన్న పంట కాలువలను చూస్తుంటే నీటి ఎద్దడి తప్పదనే భయం రైతులలో కలుగుతోంది. ఇదే సమయంలో అధికారులు చెబుతున్న నీటి లెక్కలకు, బ్యారేజీ వద్ద నీటి నిల్వకు మధ్య సంబంధం ఉండడం లేదు. ఈ విషయాన్ని సాగునీటి పారుదల శాఖ విశ్రాంత అధికారులే చెబుతున్నారు.

భద్రతకు ముప్పు!

ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ప్రస్తుత ఇన్‌ఫ్లో 26,382 క్యూసెక్కులుగా ఉంది. దిగువకు సైతం అదే స్థాయిలో నీటిని విడుదల చేస్తున్నారు. అయితే బ్యారేజీ వద్ద గేట్ల మీద నుంచి నీరు ఓవర్ ఫ్లో అవుతోంది. కానీ అధికారుల లెక్కలలో ఆ నీటి పరిమాణం ఉండదు. ఓవర్ ఫ్లో అవుతున్న సమయంలో గేట్లు మరింత పైకి ఎత్తి నీరు విడుదల చేయాలి. అధికారులు మాత్రం ఈ విషయాన్ని గాలికి వదిలేశారు. ఇలా గేట్ల మీద నుంచి నీరు ఓవర్ ఫ్లో అయితే గేట్ల భద్రతకే ముప్పు కలుగుతుంది. వాటి సామర్థ్యం దెబ్బతిని త్వరగా పాడయ్యే ప్రమాదముంది.

అనేక విమర్శలు

ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నవంబరు 8వ తేదీ నాటికి పాండ్ లెవెల్ 13.57 మీటర్లు కాగా, నీటి నిల్వ 2.88 టీఎంసీలు. కానీ ఇప్పుడు పాండ్ లెవెల్ 13.99 మీటర్లకు చేరుకుంది. నీటి నిల్వ 3.16 టీఎంసీల వరకు ఉంది. రబీ సాగు కోసం నీటిని నిల్వ చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం బ్యారేజీ వద్దకు ఎగువ నుంచి అధికంగా నీరు వస్తున్నందున ఈ స్థాయిలో నీటి నిల్వ అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. దిగువున ఉన్న ఇసుక ర్యాంపులకు ఇబ్బంది లేకుండా నీటిని తక్కువగా వదులుతున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ర్యాంపుల కోసం బ్యారేజీ గేట్లను పణంగా పెడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బ్యారేజీ వద్ద పరిస్థితి ఇలా ఉంటే హెడ్‌వర్క్స్ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

గేట్ల వద్ద లీకేజీలు

బ్యారేజీ గేట్ల నుంచి నీరు అధికంగా లీకవుతోంది. బొబ్బర్లంక వద్ద ఫ్లషింగ్ ఆపరేషన్ నిర్వహించే స్కవర్ స్లూయిజ్‌ల వద్ద మరింత ఎక్కువగా జరుగుతోంది. ఇక్కడ ఉన్న గేట్ల మధ్య ఉండే ప్రాంతాన్ని మత్స్యకారులు రొయ్య పిల్లల వేట కోసం ధ్వంసం చేస్తున్నారు. బుష్‌లు, నట్‌లు, బోల్ట్‌లను తొలగిస్తున్నారు. దీని నుంచి పెద్ద ఎత్తున నీరు విడుదలవుతోంది.

రైతుల ఆవేదన

బ్యారేజీ వద్ద ప్రస్తుతం ఇన్‌ఫ్లో బాగున్నా, ముందు ముందు పూర్తిస్థాయిలో నీరందదు. ఈ సమయంలో చేలకు నీరందించేందుకు ప్రతి నీటి చుక్కా కీలకం. నిల్వ చేసిన నీరు పోతే డెల్టాలో శివారు, మెరక ఆయకట్టుకు సాగునీరందని పరిస్థితి నెలకొంటుంది. లీకులను గుర్తించి ముందుగానే మరమ్మతులు చేయించకపోతే రబీకి నీటి ఎద్దడి తప్పదు. ఖరీఫ్ దెబ్బతినడం, పండిన చోట అనుకున్న స్థాయిలో దిగుబడులు రాక నష్టపోయిన రైతులకు రబీ సాగు కీలకంగా మారింది. నీరు ఉన్నా పూర్తిస్థాయిలో ఇవ్వలేకుంటే ఈ సాగులో సైతం చేదు ఫలితాలు చూడాల్సి ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమష్టి బాధ్యతతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు



అరట్లకట్ట హైస్కూలులో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

కరప: విద్యార్థుల చదువు పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమష్టి బాధ్యత తీసుకుంటే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించవచ్చని కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్నారు. కరప మండలం అరట్లకట్టలోని ముత్యాల సుబ్బన్న మెమోరియల్ జెడ్పీ హైస్కూల్లో శనివారం హెచ్ఎం పీవీ శివగిరి అధ్యక్షతన మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల, ఇంటి వద్ద విద్యార్థుల చదువు ఎలా ఉంటుందో తెలుసుకునేందుకే మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ అన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేశామన్నారు. పాఠశాలలో విద్యార్థుల ప్రగతి నివేదికలను తల్లిదండ్రుల సమక్షంలో చూపించి, లోటుపాట్లు వివరించేందుకు ఇదో చక్కని వేదికని అన్నారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరచుకుని ముందుకు సాగాలన్నారు. యువత మత్తు పదార్థాల వైపు మరలకుండా తల్లిదండ్రులు దృష్టి పెట్టాలన్నారు. అనంతరం నాటిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి, హెచ్ఎం డాక్టర్ శివగిరి, మండల ప్రత్యేకాధికారి, సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఎం.అనుపమ తదితరులు పాల్గొన్నారు.

సారొస్తారని కడుపుకాల్చారు



మల్లేపల్లి హైస్కూల్లో భోజనం కోసం ఎండలో బారులు తీరిన విద్యార్థులు, తల్లిదండ్రులు

- మధ్యాహ్నం 2 గంటలకు భోజనాలు ప్రారంభం
- మండుటెండలో క్యూలోనే విద్యార్థుల నిరీక్షణ

గండేపల్లి: సారొస్తారు.. వారొస్తే భోజనం పెడదాం.. అనుకున్నారో! ఏమో? జిల్లా అధికారి రాక కోసం ఎదురుచూస్తూ చిన్నారుల కడుపు కాల్చారు. సమయం దాటిపోతున్నప్పటికీ అన్నం పెట్టకపోవడంతో ఆకలి బాధ ఓర్చుకోవడం విద్యార్థులకు కష్టమైంది. ఎట్టకేలకు సార్ రావడంతో భోజనాలు వడ్డించడంతో మండుటెండను సైతం లెక్క చేయకుండా కంచాలతో విద్యార్థులు బారులు తీరారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో శనివారం నిర్వహించారు. గండేపల్లి మండలం మల్లేపల్లి హైస్కూల్‌లో సార్ కోసం మధ్యాహ్నం 2 గంటల వరకూ ఉండడంతో విద్యార్థులు ఆకలితో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని 12 నుంచి ఒంటి గంట మధ్యలో పెట్టాల్సి ఉండగా, 2 గంటలు దాటుతున్నా సార్ మెప్పుకోసం ఆపేశారు. జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ సుమారు 1.40 గంటలకు స్కూల్‌కు చేరుకుని కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం విద్యార్థులతో భోజనం చేశారు. 2.15 సమయానికి ప్రారంభమైన భోజనాలు 3 గంటలు దాటుతున్నా ముగించకపోవడంతో విద్యార్థుల తల్లులు ఆవేదనకు గురయ్యారు.

చాలీచాలని భోజనం

మల్లేపల్లి హైస్కూల్‌లో సుమారు 513 మంది విద్యార్థులకు హాజరు శాతాన్ని బట్టి నిత్యం భోజనం సిద్ధం చేస్తారు. అయితే భోజనాలు సరిపోకపోవడంతో పథకం నిర్వాహకులు మరోసారి వంట చేసి విద్యార్థులకు వడ్డించారు. అప్పటికే సమయం 3 గంటలు కావడంతో ఆకలిని తట్టుకోలేని విద్యార్థులు ఇంటి ముఖం పట్టినట్టు స్థానికులు చెబుతున్నారు. అయితే ఇక్కడి విద్యార్థులే తాగునీటిని సరఫరా చేయడం గమనార్హం.

అన్నవరం.. భక్తజన సంద్రం

- సత్యదేవుని దర్శించిన 40 వేల మంది
- దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని దేవస్థానం శనివారం భక్తజనం సంద్రంలా మారింది. శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారు జామున రత్నగిరిపై సుమారు 50 వివాహాలు జరిగాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పెళ్లిళ్లు చేసుకున్న నవ దంపతులు కూడా వారి బంధుమిత్రులతో కలసి ఇక్కడకు వచ్చి సత్యదేవుని వ్రతాలు ఆచరించారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. సుమారు 40 వేల మంది భక్తులు తరలిరాగా, సుమారు రెండు వేల వరకూ స్వామివారి వ్రతాలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో ఐదు వేల మంది భక్తులకు భోజన సౌకర్యం కల్పించారు.

కన్నుల పండువగా ప్రాకారసేవ

కార్తిక మాసంలో భక్తుల రద్దీ కారణంగా శని, ఆదివారాల్లో సాయంత్రం వేళల్లో సత్యదేవుని ప్రాకార సేవ, రథసేవ నిర్వహించిన విషయం తెలిసిందే.



తిరుచ్చి వాహనంపై సత్యదేవుడు, అమ్మవారికి ప్రాకారసేవ

కాగా కార్తిక మాసం ముగియడంతో తిరిగి యథావిధిగా శనివారం ఉదయం తిరుచ్చి వాహనంపై ప్రాకారసేవ నిర్వహించారు. ఉదయం పది గంటలకు తిరుచ్చి వాహనంపై సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆశీనులు గావించి అర్చక స్వాములు పూజలు చేశారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్ రామ్మోహన్‌రావు కొబ్బరికాయ కొట్టి ప్రాకారసేవ ప్రారంభించారు. తర్వాత ఆలయ ప్రాకారంలో నాలుగు దిక్కులా కొబ్బరి కాయలు కొట్టి ప్రాకారసేవ చేశారు. స్వామి, అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తిరిగి ఆలయానికి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఆలయ అర్చకులు, వేదపండితులు, పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా, ఆదివారం ఉదయం పది గంటలకు సత్యదేవుడు, అమ్మవారిని టేకు రథంపై ఆలయ ప్రాకారంలో ఘనంగా ఊరేగించనున్నట్లు అధికారులు తెలిపారు.



సత్యదేవుని దర్శనానికి క్యూలో భక్తులు

క్లుప్తంగా

బంగారం, నగదు మాయం

కొత్తపేట: ఇంటికి తాళం వేసి బంధువుల పెళ్లికి వెళ్లి వచ్చేసరికి దొంగలు పడి నగదు, బంగారం దోచుకుపోయారు. ఎస్సై జి.సురేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. వాడపాలెం గ్రామానికి చెందిన శ్రీఘాకోళ్లపు సుమన్ తన తల్లితో కలిసి ఈ నెల ఐదో తేదీన పొదలాడ గ్రామంలో బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్లాడు. శుక్రవారం తిరిగి వచ్చి తాళం తీసుకుని పడక గదిలోకి వెళ్లగా బీరువా తెరచి ఉంది. పరిశీలించగా దానిలో దాచిన రూ. 5 లక్షలు, 5 కాసుల బంగారం కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై సురేంద్ర సంఘటన ప్రదేశాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

అయినవిల్లి: మద్యం తాగడానికి భార్య డబ్బులు ఇవ్వలేదనే మనస్తాపంతో ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్సై పి.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. అయినవిల్లి మండలం ముక్తేశ్వరం లోని పాలిటెక్నిక్ కాలేజీ సమీపంలో నేమన భద్రరావు (45) కుటుంబంతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. అతడు మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగటానికి భార్య డబ్బులు ఇవ్వక పోవడంతో మనస్తాపం చెంది శనివారం ఉరి వేసుకుని మృతి చెందాడు. అతడి భార్య కనకదుర్గ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు



చోరీ వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరేష్ కుమార్

రాజోలు: ఇళ్ల తాళాలు పగలకొట్టి చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లాల దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. రాజోలు సర్కిల్ కార్యాలయంలో సీఐ టీవీ నరేష్ కుమార్ శనివారం ఈ వివరాలు వెల్లడించారు. అంతర్వేదిపాలెం బీరావారి కాలువ గట్టు ప్రాంతానికి చెందిన బీరా సువర్ణరాజు ఇంటిలో ఈ నెల 7వ తేదీన చోరీ జరిగింది. అలాగే గత ఏడాది అదే గ్రామానికి చెందిన చెల్లుబోయిన వెంకటేశ్వరరావు ఇంటిలో జరిగిన చోరీపై అప్పట్లో సఖినేటిపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై దర్యాప్తు చేపట్టిన ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు ఆ కేసుల్లో నరసాపురం మండలం యర్రంశెట్టివారి పాలేనికి చెందిన కొనిశెట్టి వెంకటరత్నాన్ని అరెస్ట్ చేశారు. అతడి నుంచి రూ.8.50 లక్షల విలువైన 126 గ్రాముల బంగారం వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రాజోలు కోర్టులో హాజరుపర్చగా, 14 రోజులు రిమాండ్ విధించారు.



బిక్కవోలులో ప్రత్యేకాలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



బిక్కవోలు ఆలయంలో సంతానం కోసం నాగుల చీర ధరించి దీక్షలో ఉన్న మహిళలు



రాజమహేంద్రవరంలోని కోరుకొండ రోడ్డులో స్వామివారికి అభిషేకం

అంగరంగ వైభవం

- భక్తిశ్రద్ధలతో షష్ఠి వేడుకలు
- ఉమ్మడి జిల్లాలో భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు
- సుబ్రహ్మణ్యేశ్వరునికి ప్రత్యేక పూజలు

సాక్షి నెట్‌వర్క్: వల్లీ దేవసేన సమేత సంతాన సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి మహోత్సవాలు శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అంగరంగ వైభవంగా జరిగాయి. తెల్లవారుజామునుంచే ఆలయాలకు భక్తుల రాక మొదలైంది. స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారికి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. రాజమహేంద్రవరం కోరుకొండ రోడ్డులోని ఆలయానికి భక్తులు పోటెత్తారు. అంబాజీపేట మండలం మాచవరంలో భారీ రద్దీ ఏర్పడింది. సామర్లకోట పంచారామక్షేత్రంలోని స్వామికి విశేష పూజలు జరిపారు. బిక్కవోలులోని గోలింగేశ్వరస్వామి ఆలయంలో కొలువైన కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వీటితో పాటు ప్రముఖ ఆలయాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి.



రాజమహేంద్రవరంలో క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు



అంబాజీపేట మండలం మాచవరంలో భక్తుల రద్దీ



తాటిపర్తిలో సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు



తాటిపర్తి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలోని పుట్టలో గుడ్లు సమర్పిస్తున్న భక్తులు

అక్షరాలా లక్ష గుడ్లు..

- పుట్టల్లో సమర్పించిన భక్తులు
- కిక్కిరిసిన తాటిపర్తి ఆలయం

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శనివారం జరిగిన షష్ఠి ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఏటా ఇక్కడ ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. జిల్లాలో పాటు ఇతర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుంటారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పుట్టలలో పాలు, గుడ్లు వేయడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో ఆలయానికి వచ్చిన భక్తులందరూ పిల్లలతో సహా ఇక్కడ ఏర్పాటు చేసిన దాదాపు 20 పుట్టల్లో గుడ్లు సమర్పించారు. తాటిపర్తిలో సుమారు లక్ష గుడ్ల వరకూ విక్రయాలు జరిగినట్టు అంచనా.



తాటిపర్తిలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న గుడ్లు

పారదర్శకంగా టీచర్స్ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు

కాకినాడ సిటీ: టీచర్స్ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు పారదర్శకంగా జరిగేలా అధికారులు కృషి చేయాలని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏఆర్వో, కాకినాడ జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు. కలెక్టరేట్‌లోని విధాన గౌతమి సమావేశపు మందిరంలో శనివారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఆర్వో రాహుల్ మీనా మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అనుసరించాల్సిన విధానం, ప్రాథమిక దశ ఓట్ల లెక్కింపు, డీటైయిల్డ్ కౌంటింగ్, రిజెక్టెడ్, డౌట్‌ఫుల్ ఓట్లు, కౌంటింగ్ ఏజెంట్లు తదితర అంశాలపై కౌంటింగ్ అబ్జర్వర్లు, సూపర్ వైజర్లు, ఓట్ల లెక్కింపు సిబ్బందికి అవగాహన కల్పించారు. బ్యాలెట్ బాక్స్‌లను కాకినాడ జేఎన్టీయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీ గ్రౌండ్ ఫ్లోర్‌లో భద్రపరచడం జరిగిందన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు ఉదయం 6 గంటలకే కేంద్రానికి చేరుకోవాలన్నారు. తొలిదశలో ప్రాథమిక ఓట్లు లెక్కింపు పూర్తయిన అనంతరం డీటైయిల్డ్ కౌంటింగ్ జరుగుతుందని వివరించారు. కేఎస్ఈజెడ్ ఎస్డీసీ రామలక్ష్మి, కాకినాడ ఆర్డీవో ఎస్ మల్లిబాబు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.



శిక్షణలో మాట్లాడుతున్న జేసీ రాహుల్ మీనా

జీజీహెచ్ మేనేజర్ సస్పెన్షన్



నరసింగరావు, జీజీహెచ్ మేనేజర్

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్ మేనేజర్ యండమూరి వెంకట సూర్య నాగేంద్ర నరసింగరావును సస్పెండ్ చేస్తూ వైద్య, ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ పద్మా శశిధర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నర్సింగ్ పోస్టుల విక్రయాల ఆరోపణలు, నాన్ లోకల్ అనర్హులకు ఉద్యోగాలు ఇవ్వడం, అసలు రోస్టర్ బుక్ లేకుండా ఉద్యోగ నియామక ప్రక్రియ చేపట్టడం ఆరోపణలపై జిల్లా కలెక్టర్ షణ్మోహన్ విచారణకు ఆదేశించారు. డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్ బృందం చేపట్టిన విచారణలో నరసింగరావు అవినీతికి పాల్పడ్డాడని ప్రాథమికంగా నిర్ధారణ అయ్యింది. వీటితో పాటు అనుబంధ విషయాల సమాహారంగా కలెక్టర్ ఐదు అంశాలతో కూడిన ఓ నోట్‌ఫైల్‌ను సిద్ధం చేశారు. జీజీహెచ్ మేనేజర్ అవినీతికి పాల్పడడం నిజమేనని, మెమోకు ఇచ్చిన సమాధానం సంతృప్తికరంగా లేదని, శాఖ చేపట్టాల్సిన క్రమశిక్షణా చర్యలకు అర్హుడేనని, విచారణ పూర్తయ్యే వరకు హెడ్ క్వార్టర్ విడిచి అప్‌స్కాండ్ కాకుండా చూడాలని, సదరు వాస్తవాల నేపథ్యంలో తక్షణమే సస్పెండ్ చేయాలని ఆ నోట్‌ఫైల్‌లో పేర్కొన్నారు. ఈ నోట్‌ఫైల్‌ను ఆర్డీ డాక్టర్ పద్మా శశిధర్‌కి పంపారు. శనివారం ఆర్డీ కార్యాలయం నుంచి కాకినాడ జీజీహెచ్‌కు సీనియర్ అసిస్టెంట్ స్థాయి అధికారి వచ్చారు. విచారణ నివేదికతో పాటు నరసింగరావు అవినీతికి సంబంధించి విచారణ కమిటీ అందించిన సాక్ష్యాధారాల ప్రతులను సేకరించారు. వీటిని ఆర్డీ కార్యాలయానికి తీసుకుని వెళ్లారు. నోట్‌ఫైల్‌లో కలెక్టర్ సిఫారసుల ఆధారంగా ఆర్డీ శనివారం నరసింగరావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా.. నర్సింగ్ పోస్టుల విక్రయాల ఆరోపణలపై 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన వరుస కథనాలకు కలెక్టర్ స్పందించారు. కథనాల ఆధారంగా విచారణకు ఆదేశించడంతో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో మేనేజర్ నరసింగరావును సస్పెండ్ చేశారు.

అవినీతి ఆరోపణలపై కొనసాగుతున్న విచారణ



ఫిర్యాదుదారులకు ప్రశ్నావళిని అందజేస్తున్న విచారణ అధికారి సత్యనారాయణ

ముమ్మిడివరం: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో అధికారులపై వచ్చిన అవినీతి ఆరోపణలపై శనివారం కూడా విచారణ కొనసాగింది. అవినీతిపై సామాజిక మాధ్యమాలలో పోస్టులు వెల్లువెత్తడంపై సాక్షి దిన పత్రికలో 'ఆరోగ్య శాఖలో అవినీతి జబ్బు' అనే శీర్షికన వార్త వచ్చింది. దానిపై ప్రభుత్వం స్పందించి విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా విచారణాధికారి బీవీవీ సత్యనారాయణ ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల సెమినార్ హాలుకు జిల్లాలో ఫిర్యాదు చేసిన సీహెచ్‌వోలు, ఏఎన్ఎంలను విచారణకు పిలిచారు. శుక్రవారం విచారణకు హాజరుకాని ఐదుగురు పీహెచ్‌సీ వైద్యులతో పాటు ఫిర్యాదు చేసిన ఇద్దరు సీహెచ్‌వోలు, ఏడుగురు ఏఎన్ఎంలు విచారణకు హాజరై ప్రశ్నావళిలో లిఖిత పూర్వక వివరణ ఇచ్చారు. దీనిపై విచారణ అధికారి బీవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ అవినీతి ఆరోపణలపై ఫిర్యాదు చేసిన 26 మంది పీహెచ్‌సీ వైద్యులలో 25 మంది, అలాగే ఇద్దరు సీహెచ్‌వోలు, ఏడుగురు ఏఎన్ఎంల నుంచి లిఖిత పూర్వక వివరణ తీసుకున్నామన్నారు. ఇంకా 9 మంది విచారణకు హాజరు కావాల్సి ఉందన్నారు. వారిని సోమవారం విచారణ చేసే అవకాశముందని, పూర్తయిన తర్వాత నివేదికను డీఎంఅండ్‌హెచ్‌ఓకు అందజేస్తామన్నారు.

బాలికను మోసం చేసిన యువకుడిపై కేసు

కొవ్వూరు: వేములూరు జగనన్న కాలనీకి చెందిన బాలికను గర్భవతిని చేసిన యువకుడిపై శనివారం కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. పోలవరానికి చెందిన వీరేంద్ర అనే యువకుడు ఇన్‌స్టాగ్రామ్‌లో ఏడు నెలల క్రితం బాలికకు పరిచయమయ్యాడు. అప్పటి నుంచి ఆమెతో చాటింగ్ చేస్తూ దగ్గర అయ్యాడు. ఏప్రిల్‌లో బాధితురాలు ఇంటిలో ఒంటరిగా ఉన్న సమయంలో వచ్చి ఆమెను కలిశాడు. ఆ తర్వాత నుంచి అతడి ఫోన్ స్విచ్ ఆఫ్ అయ్యింది. ఈ క్రమంలో ఈ నెల 6వ తేదీన యువతికి కడుపు నొప్పి రావడంతో తల్లిదండ్రులు కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు పరీక్షించి బాలిక ఆరు నెలల గర్భంతో ఉన్నట్టు నిర్ధారించారు. అయితే పిండం సరిగ్గా ఎదగకపోవడంతో బాలికకు అబార్షన్ అయ్యింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి



రామకృష్ణ మృతదేహం

దేవరపల్లి: విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి చెందాడు. దేవరపల్లిలో శనివారం ఈ ఘటన జరిగింది. గ్రామంలోని సిమెంట్ వర్కు కంపెనీలో లక్ష్మీపురానికి చెందిన పాకా రామకృష్ణ (45) సిమెంట్ వరలను తయారు చేస్తుంటాడు. ఈ నేపథ్యంలో తయారు చేసిన తూరలను శనివారం వాహనంపైకి ఎక్కిస్తుండగా విద్యుత్ షాక్ తగిలింది. ఈ ఘటనలో రామకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గోపాలపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

1,440 కేజీల నల్లబెల్లం స్వాధీనం



ప్రత్తిపాడు ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న నల్లబెల్లం, ఆటో

ప్రత్తిపాడు: ఆటోలో రవాణా చేసేందుకు సిద్ధం చేసిన నల్లబెల్లాన్ని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ పి. శివ ప్రసాద్ కథనం మేరకు ధర్మవరంలో ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి, నల్లబెల్లాన్ని రవాణా చేసేందుకు సిద్ధంగా ఉంచిన ఆటోని స్వాధీనం చేసుకున్నారు. ఆ ఆటోలోని 1,440 కేజీల నల్ల బెల్లాన్ని సీజ్ చేశారు. దీనికి బాధ్యులైన ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

రైతుల అభ్యున్నతికి ఐసీఏఆర్ కృషి

రాజానగరం: వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేస్తూ, సాగు విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చేందుకు భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) కృషి చేస్తుందని కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు అన్నారు. ఇందులో భాగంగా కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ దూరదర్శన్‌తో ఒప్పందం కుదుర్చుకుని, 'కృషి చౌపాల్' అనే కార్యక్రమాన్ని ప్రతినెలా ప్రచారం చేస్తుందన్నారు. మొదటి ఎపిసోడ్‌ను శనివారం ప్రసారం చేశారు. దీనిని కేవీకేలో కొందరు రైతులకు ప్రత్యేక స్క్రీన్స్ ఏర్పాటు చేసి చూపించారు. ఇటీవల విడుదల చేసిన 109 కొత్త వంగడాలలో రబీ సీజన్‌కి అనుకూలమైనవిగా 54 వంగడాల గురించి ఈ ఎపిసోడ్‌లో వివరించారు.

భోజనశాలలో వ్యక్తి మృతదేహం

కొవ్వూరు: కుమారదేవంలోని గండి పోశమ్మ గుడికి దిగువన గల భోజనశాలలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని శనివారం రూరల్ పోలీసులు గుర్తించారు. ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపిన వివరాల ప్రకారం మృతుడికి సుమారు 45 ఏళ్ల వయసు ఉంటుంది, 5.10 అడుగుల ఎత్తు ఉన్నాడు. అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడా, ఇక్కడ మృతి చెందాడా అనే విషయంపై పోలీసులు విచారణ చేస్తున్నారు. ఆలయ ఈవో ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు రూరల్ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని, లేదా 94407 96623 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

కాకినాడలో విమానాశ్రయం నిర్మించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైడీ రామారావు

కాకినాడ సిటీ: కాకినాడ నగరం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్నందున పరిసర ప్రాంతాల్లో విమానాశ్రయ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు వైడీ రామారావు అన్నారు. ఈ మేరకు శనివారం కాకినాడలోని గాంధీ భవన్‌లో తూర్పుగోదావరి జిల్లా, కోకనాడ సిటీ ప్రయాణికుల సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించిన రామారావు మాట్లాడుతూ అన్నవరం - కాకినాడ - కోటిపల్లి - నరసాపురం - బాపట్లకు కొత్త రైలు మార్గం నిర్మించాలని గతం నుంచి కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. కొవ్వూరు-భద్రాచలం మధ్య రోడ్డు, రైలు మార్గం నిర్మించాలని, దీనివల్ల హైదరాబాద్‌కు సుమారు 100 కిలోమీటర్లు దూరం తగ్గుతుందన్నారు. ఈ రైలు మార్గంపై రైల్వే బోర్డు కూడా సుముఖంగా ఉందన్నారు. కాకినాడ నుంచి కోల్‌కతా, జోధ్‌పూర్, ఢిల్లీ వయా వారణాసికి కొత్త రైళ్లను ప్రవేశపెట్టాలన్నారు. సర్కార్ ఎక్స్‌ప్రెస్, శేషాద్రి ఎక్స్‌ప్రెస్ ప్రయాణ సమయాన్ని కుదించాలన్నారు. కాకినాడ ఏడీబీ రోడ్డు నుంచి ఉప్పుటేరు మీదుగా వంతెన నిర్మించి గురజనాపల్లికి రింగ్ రోడ్డు వేయాలన్నారు. కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ పేరును కాకినాడ సిటీ జంక్షన్‌గా మార్పు చేయాలని సూచించారు. సీనియర్ సిటిజన్లలో రైల్వేలలో రాయితీ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి అడ్డూరి ఫణీశ్వర రవిరాజ్‌కుమార్, కోశాధికారి బత్తిన త్రిమూర్తులు పాల్గొన్నారు.

సఫాయి కర్మచారుల అభ్యున్నతికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ అధ్యక్షుడు వెంకటేశన్

అమలాపురం రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల ద్వారా సఫాయి కర్మచారులు అభ్యున్నతికి అధికారులు కృషి చేయాలని సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ అధ్యక్షుడు ఎం.వెంకటేశన్ అన్నారు. జిల్లాలోని పంచాయతీరాజ్, మునిసిపల్, వైద్య, ఆరోగ్య, బ్యాంకింగ్, విద్య, కార్మిక, పోలీసు అధికారులు, సఫాయి కర్మచారి కార్మికులు, కాంట్రాక్టర్లతో శనివారం కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. కార్మికుల ప్రస్తుత జీవన స్థితిగతులు, వివిధ పథకాల అమలు తీరు, జీవనోపాదుల కల్పన తదితర పురోగతి అంశాలపై సమీక్షించారు. చైర్మన్ మాట్లాడుతూ సఫాయి కర్మచారి కార్మికులకు పీఎంఏవై టిడ్కో పథకాల ద్వారా గృహాలు మంజూరు చేయాలన్నారు. సెప్టిక్ ట్యాంక్ వాహనాలు సమకూర్చిన వారికి లిక్విడ్ వేస్ట్ అన్‌లోడింగ్ కోసం ట్రీట్మెంట్ ప్లాంట్లను రాబోయే రెండు మాసాలలో అందుబాటులోకి తేవాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. బీమా, పీఎఫ్, సౌకర్యాల తోపాటు సేఫ్టీ కిట్లను ఇవ్వాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మాట్లాడుతూ కార్మిక సంఘాలు, కార్మిక సమస్యలను కమిషన్ చైర్మన్ దృష్టిలో పెట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.మదనమోహనరావు తదితరులు పాల్గొన్నారు.